# ఇది మదరాసు

రచన :

శ్రీ మల్లాది రామకృష్ణశాస్త్రి

ఎందుచేత చెపుమా...

...పార్కులో నిలుచున్న పానగల్ రాజా వారు, నావంక చూడటంలేదు.

ఆహా! అదా హేతువు ?...

ఎదురుగుండా బెంచిమీద కూర్చున్న గులాబీ చీర కుర్రది, ఒళ్లో అద్దాలపాపణ్ని ముద్దిచ్చి లాలించి చిటి-పొటి నవ్వులు నవ్వించుతూంటే... ఆ చోద్యం చూడాలని అటువైపు తిరిగి ఠీవిగా నిల్చున్నారు:

... ... ...

చూసింది చాల్లే ప్రభూ ! ఎంతసేపు చిత్తగించినా, అదే ముచ్చట...దయచేసి ఆ చూపు ఒకతూరి ఈ పక్కకు రానీండి...ఇదిగో ఇల్లింతే చేరువలో, ఎవరో సుందరాంగి పచ్చపట్టుమీద పవళించబోయిన రీతి ఒరిగి కులుకుతూంది... నాకు తనివితీరా ఆవంక చూడాలనే తహ-తహ ఉంది... కాని ఏమనుకుంటుందో అని భయం. ఏమనుకుంటే ఏం ముణుగుతూందో అని హడలు...

కాని, మీకు ఆ ఫరవా ఏమీలేదు...మీదివ్యచిత్తమునకు ఆధరించే అర్హత మీకు ఉన్నదండీ-అదికాకుండా, ఆచిన్నది, యిందాకటినుంచీ మీ వంకనే చూస్తూన్నదండీ...వచ్చి కూర్చున్నప్పటి నుంచీ, అద్దే వరుస.

'నీకెల్లా తెలుసయ్యా ?' అంటారా ? తెలియకేమీ దేవా ?...ఆ చూపులు నా వెన్ను దూసుకుని మీ సమ్ముఖానికి ప్రసరిస్తున్నాయి...ఇప్పటికైనా మీ ఒళ్ళు గగుర్పొడవటం లేదా ?-లేకపోతే మీది వత్తి రాతి-మనసా ?

కాదండోయ్, నేనే పొరబడ్డాను. మీకు యిక్కడకన్న, కనువిందుచేసే ఘనకార్యం, మీ సముఖంలోనే జరుగుతూంది. నేను యిందాకటి నుంచీ గమనించనేలేదు...

ఎవరో యిద్దరువచ్చి...మీకు వెన్నిచ్చి ఆ బల్లమీద కూర్చున్నారు. ఆ తలకాయల్లో ఒకతల్లో పూలున్నాయి...ఆ కంఠాల్లో ఒకి కంఠం కంబుగళం. ఈ తలను ఆ తల కవ్విస్తూంది. ఆ తల...ఈ తలను నవ్విస్తూంది...ఏతల్లో ఏముందో ఎవరెరుగుదురు స్వామీ...ఈ తాకుల గుడిసెల్లో ఇనుడుదయించడం...కవి సమయంగా చెల్లదు...

పార్కులో అన్నీ చెల్లేసుమండి ! ప్రభువుల సన్నిధి గనుక వాటికి యావజ్జీవం అలా నిలువు జీతాలే. ఎన్నియేళ్ళువచ్చినా వల్లేరాయడంటూ దాపురించకపోవడంతో ఒంటరిగా వయసంతా ఎలా వెళ్ళబుచ్చుతున్నారో చూడండి పాపం, ఆమానులు !-వాటికి కడుపున నాలుగు కాయలు కాయడం...మీరు చూడబోరు కదా...

నట్టనడుమ నిలుచుని, రేడియో కొమ్మెక్కి-బాకా లూదుతూంది...మీకోసం కాదు సుమండీ-మాకోసం...ఆ ఘోష.

రాజావారి అనుమతితో అక్కడక్కడే దీపాలు వెలిగాయి...తాన్ సేన్ చిత్రం తాముకూడా ఒకతూరి చిత్తగించేందుకు వీలుంటే, బాగుండిపోను, ప్రభూ...

పోనీలెండి...అద్దోనికేంగాని తమ సన్నిధిని జరుగుతూన్న చిత్రాన్ని చిత్తగించండి...


ఎవరో దివ్యసుందర విగ్రహం...మీ పాదతలమును ఆనుకుని...విగ్రహంలాగా నిలుచుని ఉంది. ఎప్పుడు వచ్చిందో, ఏలాటి వయ్యారి నడకతో అక్కడకు చేరిందో నేను చూడలేదు. మీరు చూసినా, ఉలకరు, పలకరు...

'ఓయి పరమఛాందసా ! చిమ్మ చీకటిలో పరుంటివి...ఆ విగ్రహం దివ్యసుందరమని...ఏమిటయ్యా నీ దిలాసా ?' అని ప్రభువులకు మనసులో సందేహం పొడసూపవచ్చును...ఉచితమే, అది.

అలా అయితే, ఆవధరించండి స్వామీ...తమ విగ్రహం దివ్యసుందరమని ఒప్పుకోక తప్పదుకదా-సాయుజ్యాన్ని పట్టి అయినా సారూప్యం అబ్బితీరక తప్పదుకద ! సుందరి కాక...మామూలుగా

AAA 162

# వారి కుయుక్తులను తెలుసుకొని
# వారికి భంగము గలుగజేయుడు




ఆమె చెప్పినదే సరి. వర్తకునిదే తప్పు. ఇంతకుపూర్వము ఎక్కువ ధరయిచ్చిన నెపమున ఇప్పుడు కంట్రోలు ధరకన్న ఎక్కువ ధరకు అమ్ముట సరియైన సమాధానము కాదు

# బ్లాక్‌మార్కెట్టులో
# ఎక్కువ డబ్బివ్వనని చెప్పుడు
# - అప్పుడు బ్లాక్‌మార్కెట్టే యుండదు

(భారత ప్రభుత్వపు ఇన్‌ఫర్మేషన్ మరియు బ్రాడ్‌కాస్టింగ్ శాఖవారిచే ప్రకటించబడినది.)

యిక్కడకు వచ్చిపోయే అందరు మందరలలాటివే అయితే—వచ్చేటప్పుడే ఓ అరణా వేర్ కడలో కడల్ బటానీలో చెంగులో పోసుకుని మెక్కేసి కూర్చున్నచోటనుంచే కాస్సేపు నలు మూలలా కలయజూసి ... ప్రొద్దుగూకుతూండగా లేచి చక్కా పోయేది...కూర్చున్నచోటమాత్రం అంత మేర పచ్చపట్టుమీద ముద్ర ఉండేది.

కాదు గనుకనే...వెలుతురులోంచి చీకటిచిందులు త్రొక్కేచోటికివచ్చి నిలుచుంది...

అవధారయ, దేవా...

'ఈ సీమ హరిణాక్షులవలె కా
దీమోహనాంగి కాశీపురినుండి వచ్చినది,కల్యాణి
వేణుగోపాల కన్నడ సేయక నీదరబారు, కాచి
యున్నది'...

మీలోకం వాడేనండీ...సారంగపాణి...అల్లదిగో ఆ పచ్చరంగు మేడనుంచి...ఫోనులో...ఆలిండియా రేడియోవారి అనుమతితో తమకు విన్నవించుతూన్నాడు...పదం వింటూంటే...మీకు తెలియదేమో కాని మీ మనసూ కదను త్రొక్కుతూంది ప్రభూ...

పలుకరించండి...పాపం- ఏమనుకుంటూందో-
—ఏమనుకుంటూందో...

'...రామరామ నీ యెదుటకు
రాను, రాను సిగ్గయియున్నదాన, ఇక
ఏమో యని ఎంచకు...రా'

—నాకు వినపడుతూన్నదండీ. అలా పేరుపెట్టి పిలిచి...ఆ మనసు బ్రతిమాలుతూంటే, మిమ్మల్ని కాదన్నట్టు ఊరుకుంటారేం...

నిజమే లెండి...మీరు సర్వజ్ఞులు-గ్రహించే...మన్నకున్నారు...మీకోసం కాదండోయ్ అలా పడిగాపులు పడివున్నది...అదిగో అక్కడ రగులుతూన్న ఆ సిగరెట్ కోసం...

ఇద్దరూ...సవరదీర్ఘ సంధిలాగా ... వెలుతురులోకి వెళ్ళిపోతున్నారు...ఇంతసేపటినుంచి ప్రభుకటాక్ష పాత్రమైన ఆ విగ్రహం...ఆర బయట అన్నిలక్షల సంఖ్యలోనూ...ఒకటై మారుపడిపోతుంది...పాపం పోనీండి...చీకటిలో ఉండే వెలుగు... వెలుతురులో లేదని...యీ మానవులకు ఏం తెలుసును ?

ఊళ్ళో గడియారాలన్నీ...కొంచెం కుడి - ఎడంగా... ఓకే వేళ మోగేందుకు ప్రారంభించినవి...ఒకదానితో ఒకటి ఏకీభవించకుండా...వాటిలో వాటికే అంత పొరపు అయినప్పుడు...నామనకు మాత్రం అవి చెప్పేదే, వేదం ?—వాటికి ప్రొద్దుపోతే పోనీండి...మనకు, మనదే వేళా-పాళా...

మీకు-నిద్రేలేదు. నాకు నిద్రంటేనే, సరిపడదు...కాని...తమరు ఏదో పరాకుగా ఉన్నారు. నేనూ...ఇహ బయలుదేరి...ఏలవలసినపరగణాలు ఎన్నో ఉన్నాయి...

మరి, నాకు సెలవా, ఉంటే మళ్లీ దర్శనం చేస్తాను. తమలాగా ఉన్నచోటనే కలకాలమూ పడిఉండగల భాగ్యానికి మేము నోచలేదుకదండీ.

---

## పాశ్చాత్యస్త్రీ సగటున

75 ఏళ్ళు బ్రతుకుతుంది. 26 వ ఏట పెళ్ళి చేసుకుంటుంది, 7 పౌన్ల 8 అవున్సుల పసిబిడ్డను కంటుంది.

పెళ్ళిఅయిన మొదటి సంవత్సరంలోనే మొగుడితోటి రెండుసార్లు పోట్లాడుతుంది.

5 అడుగుల 3 అంగుళముల ఎత్తు ఉంటుంది.

130 పౌన్ల బరువు ఉంటుంది.

సినీమాకి 2700 సార్లు వెడుతుంది.

26 ఏళ్ళు పడుకుంటుంది.

8 ఏళ్ళు ఇంటిపని చేస్తుంది.

4 ఏళ్ళు అనవసరపు బాతాఖానీలో గడుపుతుంది.

దంతధావనం 28000 సార్లు చేస్తుంది.

7000 గాలన్ల టీ పుచ్చుకుంటుంది.

మూడు పుట్టీల చాకలెట్సు, తీపి వస్తువులు మొత్తం 600 పౌన్లవరకూ ఖర్చుపెట్టి తింటుంది.

తలవెంట్రుకలు 38 అడుగులు పెంచుతుంది.

కంటిఅద్దాలకోసం 6 దినాలు వెతుకుతుంది.

8 ఏళ్ళు మాట్లాడుతుంది.

—కుచ్చు సుబ్రహ్మణ్యం.

●

## కారణం

రాముడు :— మేష్టారు పాఠం చెప్తూంటే క్లాసులో కునికిపాట్లు పడతావేమిరా !

సాంబుడు :— మేష్టారు నన్ను చూస్తున్నారో లేదో కనిపెడదామనిరా !

—ఓరుగంటి భైరవశాస్త్రి.

---